క్లుప్తంగా

సంస్కృతిపై అవగాహన పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ప్రొఫెసర్ అభిలాష్ పిళ్లై

తుని: ప్రస్తుత విద్యా విధానంలో లలిత కళలను భాగం చేసినప్పుడే భారతీయ సంస్కృతి, కళలపై విద్యార్థులకు అవగాహన ఏర్పడుతుందని నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ప్రొఫెసర్ అభిలాష్ పిళ్లైఅన్నారు. మంగళవారం స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థలకు విచ్చేసిన ఆయన విద్యార్థులతో సమావేశమయ్యారు. మన సంస్కృతీ సంప్రదాయాలను ఇతర దేశాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని, మనం భవిష్యత్తు తరాలకు వీటి విశిష్టతను తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా న్యూఢిల్లీ ప్రఖ్యాత నటి జిల్‌మిల్ హజారికా మాట్లాడుతూ విద్యతో పాటు నాట్యం, అభినయం తదితర రంగాల్లో యువత ఆసక్తి చూపాలన్నారు. ఇన్నోవేటివ్ థియేటర్ డైరెక్టర్ తూము శివప్రసాద్, ప్రిన్సిపాల్ కె.వీర్రాజు, బంగార్రాజు, పెనుగొండ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

భూదాన భూమి అమ్మకాలకు నిరసనగా ధర్నా



ఏలేశ్వరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దళితులు

ఏలేశ్వరం: మండలంలోని తిరుమాలిలో భూదాన భూమి అమ్మకాలకు నిరసనగా మంగళవారం ధర్నా చేశారు. సీపీఐ(ఎంఎల్) వినోద్‌మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద దళితులు ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుమాలిలో భూదాన భూమిని నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు సాగిస్తున్నారన్నారు. దీనిపై అధికారులు వెంటనే విచారణ చేపట్టి న్యాయం చేయాలని దళితులు కోరారు. కార్యక్రమంలో కె.గణేష్, బొండాడ పార్వతి, దొమ్మేటి లక్ష్మి, సుందరపల్లి అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ప్రమాదాల నివారణపై అవగాహన

తొండంగి: మండలంలోని ఏవీ నగరంలో వంటగ్యాస్ ప్రమాదాల నివారణపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వైష్ణోదేవి గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో గ్రామంలోని బాబూ జగ్జీవన్‌రామ్ సెంటర్, ఎస్సీ కాలనీ తదితర ప్రాంతాల్లో మహిళలకు కళాజాతా ద్వారా ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

గ్రేడింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు

ప్రత్తిపాడు: రైతులు పండించిన ధాన్యాన్ని గ్రేడింగ్ లేకుండా రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రంబాల వెంకటేశ్వరరావు కోరారు. ప్రత్తిపాడు బీజేపీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహిస్తున్న మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ప్రతి పోలింగ్ బూత్‌లోనూ టీవీ ద్వారా ప్రజలకు చూపించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. బీజేపీ మండలాధ్యక్షుడు గున్నాబత్తుల రాజబాబు, పార్టీ నాయకులు శింగిలిదేవి సత్తిరాజు, కర్రి ధర్మరాజు, కొల్లా శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఘనంగా పోలమ్మ తీర్థం

గండేపల్లి: తాళ్లూరు గ్రామ దేవత డెక్కలపోలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం వివిధ దేవతామూర్తుల వేషధారణలతో నిర్వహించిన ఊరేగింపు ఆకట్టుకుంది.

వ్యవసాయ కూలీ మృతి

సామర్లకోట: మండల పరిధిలో పీబీ దేవం సమీపంలో మంగళవారం ట్రాక్టర్ నుంచి పడి ఒక వ్యవసాయ కూలి మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం ధాన్యం ఎగరబోత ట్రాక్టరుపై పీబీ దేవం నుంచి రామచంద్రపురం వెళ్తున్న ముగ్గురు కూలీలు ట్రాక్టర్ ఇంజిన్‌పై కూర్చున్నారు. ట్రాక్టర్ అదుపు తప్పడంతో అడ్డతీగల మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన పట్నం నాగరాజు (30) జారిపడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు.



ఏలేశ్వరంలో మోటారుబైక్‌పై టోపీ, సైకిల్‌పై ముసుగు ధరించి వెళుతున్న మహిళలు



నిర్మానుష్యంగా మారిన లింగంపర్తి రోడ్డు

● భానుడి భగభగలు

ఏలేశ్వరం: ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 8 గంటలకే భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. వేసవి తాపానికి నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ఉదయం నుంచి ఎండలు తీవ్రంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నియోజకవర్గంలో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండలకు ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల తగ్గుముఖం పట్టారు. ప్రధానరహదారులు జనసంచారం లేక వెలవెలబోయాయి. జాతీయరహదారి సైతం మధ్యాహ్న సమయంలో నిర్మానుష్యంగా దర్శనమిచ్చింది. వాహనదారులు ఎండను తట్టుకొనేందుకు టోపి, ముసుగులు ధరించారు.

మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం ఏర్పాటు



ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ సభ్యులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్

శంఖవరం: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. కమిటీ చైర్మన్‌గా జిగిరెడ్డి రమణమ్మతో పాటు 20 మందిని సభ్యులుగా నియమిస్తూ మార్కెట్ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి మంగళవారం ఉత్తర్వులిచ్చారు. కమిటీ గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్, వైస్ చైర్మన్‌గా శేరు కృష్ణ, సభ్యులుగా గుండబోలు కోటేశ్వరరావు, పాకల శివలింగ ప్రసాద్, తొండారపు లక్ష్మి, సఖిరెడ్డి సుర్రాజు, వడ్డి శ్రీలత, చెన్నాడ సత్యవతి, పలివెల శ్యామల, రేఖా లక్ష్మి, అల్లం సుబ్బలక్ష్మి, పైలా విజయ్‌కుమార్, నాగులాపల్లి అప్పారావు, గోళ్ల బాల సుందర్ జయశేఖర్ బాబు, సూరంపూడి నూకరాజు, లంపకలోవ సొసైటీ అధ్యక్షుడు గొంతిన సురేష్‌లతో పాటు జిల్లా అగ్రి ట్రేడ్ మార్కెటింగ్ ఆఫీసర్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాపర్తి రామకృష్ణను నియమించారు.

మార్కెట్ పురోభివృద్ధికి పాటు పడాలి

ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ సూచించారు. మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ సభ్యులను మంగళవారం సాయంత్రం తన స్వగృహంలో ఎమ్మెల్యే పర్వత శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. రాజకీయాలకు అతీతంగా రైతుల సంక్షేమం కోసం పాటు పడడం ద్వారా పదవులకు వన్నె తేవాలని సూచించారు. తమకు మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులుగా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే పర్వత ప్రసాద్‌కు నూతన కార్యవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు గడువు పెంపు

గోకవరం: ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 28 వరకు గడువు పెంచినట్టు భూపతిపాలెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బేతపూడి రవి మంగళవారం తెలిపారు. భూపతిపాలెం బాలుర గురుకుల పాఠశాలలో 2023-24 విద్యాసంవత్సరంలో ఐదో తరగతి ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారులకు వచ్చే నెల 20న జిల్లా ప్రధాన కేంద్రంలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 98665 59622 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

రేపు డయల్ యువర్ డీఎం

ఏలేశ్వరం: ప్రయాణికుల సమస్యలను తెలుసుకునేందుకు గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్టు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ జి. సత్యనారాయణ మంగళవారం తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలోని సర్వీసులపై ప్రజల నుంచి సలహాలు, సూచనలు పొందుటకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రజలు, ప్రయాణికులు 99592 25532 నంబర్‌కు కాల్ చేసి తమ సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

మలేరియా రహితం... సమాజ హితం



తొండంగి మండలం ఏవీ నగరంలో అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



జగ్గంపేట సీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ఏలేశ్వరంలో ర్యాలీ చేస్తున్న కమిషనర్ కొండలరావు, వైద్య సిబ్బంది

- ఘనంగా మలేరియా నివారణ దినోత్సవం
- గ్రామాల్లో అవగాహన ర్యాలీలు

తొండంగి: మలేరియా రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఏవీ నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవికుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం ఏవీ నగరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. తొలుత పీహెచ్‌సీలో అవగాహన సదస్సు జరిగింది. మలేరియా వ్యాధి వ్యాప్తి, ప్రభావం, లక్షణాలు, నివారణ వంటి అంశాలపై డాక్టర్ రవికుమార్ అవగాహన కల్పించారు. అనంతరం దోమలను నిర్మూలిద్దాం-వ్యాధులను అరికడదాం అనే నినాదంతో ప్లకార్డులు ధరించి గ్రామంలో ర్యాలీ చేశారు. వైద్యారోగ్యశాఖ కమ్యూనిటీ అధికారి మధు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: ప్రట్టణ ప్రజలకు మలేరియా నివారణపై అవగాహన కల్పిస్తూ మున్సిపల్ కమిషనర్ కొండలరావు ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. మలేరియాకు కారణమైన దోమలను నిర్మూలించాలని, వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వాసుపత్రి, విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మలేరియా నివారణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

గోకవరం: మలేరియా నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర శ్రీవల్లి, కర్రి సూరారెడ్డి కోరారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని గోకవరంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. తొలుత స్థానిక సచివాలయం వద్ద ప్రజలకు మలేరియా వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు తోలేటి రాంప్రసాద్, బి.వీరచంద్రం తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: మండల పరిధిలోని గ్రామాల్లో పెద్దిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ రత్నంబాబు మలేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు.

మలేరియా నిర్మూలనకు సమష్టిగా కృషిచేద్దాం

జగ్గంపేట: మలేరియా నిర్మూలనకు సమష్టిగా కృషి చేద్దామని వైఎస్సార్ సీపీ సచివాలయాల మండల కన్వీనర్ బందారు రాజా అన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మలేరియా పుట్టుక, వ్యాప్తి, పరిణామాలపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఆసుపత్రి ఆవరణలో దోమల నివారణకు ఉపయోగించే రసాయనాలు, ఫాగింగ్ మెషీన్లు, మలేరియా నిర్ధారణ పరీక్షలు, మందులుతో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. స్థానిక సీహెచ్‌సీ డాక్టర్ రమేష్‌కుమార్, పెద్దాపురం మలేరియా సబ్ యూనిట్ అధికారి పి.జీవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాగి జావ.. ఆరోగ్యం బాగు

- జగనన్న గోరుముద్దలో మరో పౌష్టికాహారం
- విద్యార్థులకు వారంలో మూడు రోజులు పంపిణీ
- నియోజకవర్గంలోని 177 పాఠశాలల్లో అమలు

ప్రత్తిపాడు: చదువుతోపాటు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వ ప్రత్యేక దృష్టి పెట్టింది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోషక విలువలు ఎక్కువగా ఉన్న రాగి జావను అందిస్తోంది. ఐరన్, కాల్షియం వంటి పోషకాలు అందించి విద్యార్థుల్లో రక్తహీనత, పోషకాహార లోపాన్ని నివారించేలా చర్యలు తీసుకుంది. ప్రభుత్వం గత నెల 21 నుంచి జగనన్న గోరుముద్ద మెనూలో రాగి జావను చేర్చింది. మధ్యాహ్న భోజన పథకంలో ఇప్పటికే మార్పులు చేసిన ప్రభుత్వం 'జగనన్న గోరుముద్ద' ద్వారా ప్రతి రోజూ మెనూ మార్చి రుచికరమైన, నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తోంది. నియోజకవర్గంలోని 177 ప్రభుత్వ పాఠశాలల్లోని 14,174 మంది విద్యార్థులకు వారంలో మంగళ, గురు, శనివారాల్లో బెల్లంతో తయారు చేసిన రాగి జావను అందిస్తోంది.

పోషకాహార లోపం నివారణ

రాగి జావలో ఐరన్, కాల్షియం పుష్కలంగా ఉంటాయి. వీటిని విద్యార్థులకు అందించడం ద్వారా విద్యార్థుల్లో ఆ లోపాలుంటే నివారించవచ్చు. ఇప్పటికే వారంలో సోమవారం నుంచి శుక్రవారం వరకు (ఐదు రోజులు) ప్రతిరోజూ గుడ్డు ఇవ్వడంతో పాటు సోమ, బుధ, శుక్రవారాల్లో (మూడు రోజులు) చిక్కీలు అందిస్తున్నారు. తాజాగా రాగి జావను మంగళ, గురు, శనివారాల్లో ఇస్తున్నారు. ఒక్కో విద్యార్థికి మధ్యాహ్న భోజనంతో పాటు 150 మిల్లీలీటర్ల రాగి జావ ఇస్తున్నారు. ఇందుకు ఒక్కొక్క విద్యార్థికి 10 గ్రాముల రాగి పిండి, 10 గ్రాముల బెల్లం పొడి ఉపయోగించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

మండలాల వారీగా ప్రభుత్వ పాఠశాలలు, గోరుముద్ద తింటున్న విద్యార్థుల వివరాలు

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
ప్రత్తిపాడు	48	4,429
ఏలేశ్వరం	39	3,890
శంఖవరం	47	3,149
రౌతులపూడి	43	2,706
మొత్తం	177	14,174



ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాగి జావ తయారు చేస్తున్న మిడ్డే మీల్స్ కార్మికులు

విద్యార్థులకు బలం



రాగి జావ వల్ల ఐరన్, కాల్షియంతో పాటు మెగ్నీషియం, ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్ తదితర పోషకాలు విద్యార్థులకు పుష్కలంగా అందుతాయి. ఏ ఒక్కరూ పోషకాహార లోపం బారిన పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం విద్యార్థులకు రాగిజావను అందిస్తోంది. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వారంలో మూడు రోజుల పాటు విద్యార్థులందరికీ రాగిజావ అందిస్తున్నాం. – వి.రాజబాబు, మండల విద్యాశాఖాధికారి, ప్రత్తిపాడు

ఎన్నో ప్రయోజనాలు



రాగుల్లో ఫైబర్, ప్రొటీన్లు, న్యూట్రిషన్లు సమృద్ధిగా ఉంటాయి. వీటిలోని పోషకాలు, ఫైబర్ వల్ల అనేక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. టీ, కాఫీలకు బదులుగా రాగిజావ తీసుకుంటే జీర్ణశక్తి పెరుగుతుంది. వేసవిలో రాగి జావే శ్రేయస్కరం. బీపీ, సుగర్‌ను కూడా రాగిజావ నియంత్రిస్తుంది. ఎన్నో పోషకాలున్న రాగిజావను విద్యార్థులకు అదించడం అభినందనీయం. – ఆర్ ఆర్ పవన్‌కుమార్, వైద్యాధికారి, రాచపల్లి పీహెచ్‌సీ, ప్రత్తిపాడు మండలం

పేదల అభ్యున్నతే లక్ష్యం



సీతారాంపురంలో మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- సీతారాంపురంలో గడపగడపకూ మన ప్రభుత్వం

జగ్గంపేట: పేదల అభ్యున్నతి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని రాజపూడి శివారు సీతారాంపురంలో మంగళవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత మూడేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా ఇప్పటికే కోటి ఇళ్లను సందర్శించినట్టు తెలిపారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. తమ ప్రభుత్వంలో కులమతాలు, ప్రాంతాలు, రాజకీయాలకు అతీతంగా అన్నివర్గాలకూ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్టు చెప్పారు. అనంతరం జిల్లా మినరల్ ఫండ్స్ రూ.33 లక్షలతో గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనం, అద్దె భవనంలో ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన ప్రారంభించారు. జిల్లా పరిషత్ నిధులు రూ.5 లక్షలతో నిర్మించే కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సీనియర్ నేత జ్యోతుల రామస్వామి, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యూరి నాని, రాజపూడి సర్పంచ్ బూసాల విష్ణు, సీతారాంపురం వైఎస్సార్ సీపీ నేత కృష్ణార్జున, జె.కొత్తూరు సర్పంచ్ నకిరెడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రూపులమ్మతల్లి ప్రవేశద్వారం ప్రారంభం



రూపులమ్మ అమ్మవారి ప్రవేశద్వారాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్యవతి



శిల్పి అప్పలరాజును సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: పట్టణంలో భక్తుల కోరిన కోర్కెలు తీర్చే రూపులమ్మ తల్లి ప్రవేశద్వారం (ఆర్చి)ను మంగళవారం ప్రారంభించారు. అలమండ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్‌వీధిలోని రూపులమ్మ అమ్మవారి ఆలయం ఎదురుగా ప్రధాన రహదారిని అనుకుని నిర్మించిన ఈ ప్రవేశ ద్వారాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి ప్రారంభించారు. ద్వారంపై రూపులమ్మ అమ్మవారు, వీరబ్రహ్మేంద్రస్వామి, భక్తాంజనేయస్వామివార్ల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సత్యవతి మాట్లాడుతూ రూపులమ్మ అమ్మవారి కరుణకటాక్షాలు భక్తులపై ఉండాలన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో శిల్పి శీరం అప్పలరాజును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ అలమండ వీరరాఘవస్వామి, విశ్వహిందూ పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు అలమండ దుర్గావెంకటప్రసాద్, కటకం కిరిటీ, తూమురౌతు గురయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు అలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు, వాగు బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు సన్మానం



ఏలేశ్వరంలో విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన పైల విజయ్‌కుమార్‌ను పట్టణంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. వైఎస్సార్ సీపీ నేత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో విజయ్ కుమార్‌ను శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ మార్కెట్ కమిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనను డైరెక్టర్‌గా నియమించిన ఎమ్మెల్యే పర్వతపూర్ణచంద్రప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు యిజనగిరి ప్రసాద్, కోరాడ ప్రసాద్, సిరిపరపు రాజేష్, జామి ఆదినారాయణ, సామంతుల చిన్నారావు, పతివాడ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిశంకరాచార్య జయంతి



తపోవనం ఆశ్రమంలో ఆది శంకరాచార్యులకు పూజలు చేస్తున్న సరస్వతీ మహాస్వామి



రత్నగిరిపై ఆదిశంకరాచార్య విగ్రహంతో ఊరేగింపు నిర్వహిస్తున్న పండితులు

తుని రూరల్: మండల వ్యాపంగా ఆదిశంకరాచార్య జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమం, హంసవరంలో శంకర పంచమి ప్రాజెక్టు సేవా సంస్థ, ఎస్.అన్నవరంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో జయంత్యోత్సవాలు నిర్వహించారు. తపోవనం ఆశ్రమంలో పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సరస్వతీ మహాస్వామి మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షణ కోసం అవతరించిన మహనీయులు ఆదిశంకరాచార్య అన్నారు. భారత దేశంలో నలుదిక్కులా నాలుగు ప్రధాన మఠాలు స్థాపించారన్నారు. పండితులకే కాకుండా సామాన్యులకు సైతం అర్థమయ్యేలా రచనలు చేశారన్నారు. ప్రతిఒక్కరూ ఆది శంకరాచార్యలను స్మరించి, తరించి సనాతన హిందూ ధర్మాన్ని కొనసాగించాలన్నారు. వేదపండితులు, అర్చకులు, వేద విద్యార్థులు పాల్గొన్నారు.

రత్నగిరిపై జగద్గురు ఆదిశంకరాచార్య జయంతి

అన్నవరం: జగద్గురు ఆదిశంకరాచార్య జయంతిని మంగళవారం రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో ఘనంగా నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు సత్యదేవుని ఆలయంలో జగద్గురు ఆదిశంకరాచార్య విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాకారంలో ఊరేగింపు నిర్వహించారు. హిందూ ధర్మ పరిరక్షణకు శంకరాచార్య చేసిన కృషిని కొనియాడారు. వేదపండితులు గొల్లపల్లి ఘనపాఠి, చిట్టి శివ, యనమండ్ర శర్మ, గంగాధరబట్ల గంగబాబు, ముష్టి పురుషోత్తం, ఇంద్రగంటి నర్సింహమూర్తి, కోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మే డే కరపత్రం ఆవిష్కరణ

ప్రత్తిపాడు: ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని (మే డే) విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు కోరారు. ప్రత్తిపాడు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో మంగళవారం సీఐటీయూ మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేడే రోజున ప్రత్తిపాడులో నిర్వహించే ర్యాలీ, బహిరంగ సభలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం మేడే కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో నెట్ల శ్రీను, సీఐటీయూ నాయకులు బి.సురేష్, కె.పార్వతి, పి.వరలక్ష్మి, సీహెచ్ వెంకటలక్ష్మి, పి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

ప్రత్తిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగిన ఘర్షణకు సంబంధించి నలుగురిపై కేసు నమోదు చేసినట్టు మంగళవారం స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. జాతీయ పంచాయతీరాజ్ వేడుకల్లో పుణ్యమంతుల లక్ష్మీనారాయణ, తాతపూడి బుజ్జి, మదినే నూకరాజు, బెహరా దొరబాబు గందరగోళం సృష్టించారు. వచ్చిన అతిథులను భయభ్రాంతులకు గురిచేశారు. శేరు కృష్ణపై విచక్షణా రహితంగా దాడి చేసి, అడ్డుకోబోయిన గాయపరిచారని ఎంపీడీఓ ఎస్.వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.